## క్లుప్తంగా

### నిత్యాన్నదానానికి రూ.1లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న రాఘవరావు దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు గురువారం రూ.1.01 లక్ష విరాళాన్ని సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ శీనానాయక్‌ను కలిసి నిత్యాన్నదానానికి విరాళంగా అందజేశారు. అనంతరం రాఘవరావుకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

### శాస్త్రోక్తంగా హనుమద్ యాగం

ఒంగోలు మెట్రో: శ్రీగిరి క్షేత్ర పాలకుడైన అభయాంజనేయస్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. గురువారం ఒంగోలు నగరంలోని కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో అర్చకులు వేదపండితులు హనుమత్ యాగం, పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**నేడు సుందరకాండ పారాయణ..**

అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాల్లో భాగంగా నేటి ఉదయం ఏడు గంటలకు మునుకుట్ల సుబ్రహ్మణ్య శాస్త్రిచే అభయాంజనేయస్వామి సుందరకాండ పారాయణ జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని దేవస్థాన ధర్మకర్తలు కోరారు.

### కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు



మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులోని కడియాల యానాదయ్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గురువారం పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ విద్యార్థులకు మెగా పేరెంట్స్ డే నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆసుపత్రి డాక్టర్ ఆనంద్ మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ కోరిన నేపథ్యంలో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫిలోమిన, సూపర్వైజర్ బాలకోటయ్య, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎస్‌ఎంలు విద్యార్థులు కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన



చీమకుర్తి రూరల్: సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలని పీహెచ్‌సీ సిబ్బంది పేర్కొన్నారు. గురువారం మండలంలోని బండ్లమూడి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది డెంగీ నివారణ కోసం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మధుసూదన్ పాల్గొని అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేశారు.

## అందని నిధులు..
# ఆగిన పనులు..!

- పంచాయతీలకు అందని 15వ ఆర్థిక సంఘం నిధులు
- ప్రశ్నార్థకంగా మారిన గ్రామాల అభివృద్ధి
- నిధుల లేమితో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
- మండలంలోని గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం

చీమకుర్తి రూరల్: గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధి.. అన్న మాటను ప్రభుత్వం అటకెక్కించింది. నిధుల లేమితో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక కునారిల్లుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు కూడా గ్రామాల్లో సరైన మౌలిక వసతులు కల్పించలేదంటే పాలన అంత దారుణంగా ఉందో ఇట్టే అర్థమవుతోంది. కూటమి ప్రభుత్వం వ్యవస్థల నిర్వీర్యమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. గ్రామాభివృద్ధికి ఉపయోగపడే గ్రామ సచివాలయ వ్యవస్థను ఇప్పటికే నిర్వీర్యం చేసింది. వ్యవసాయం, విద్య, వైద్యం, ఆరోగ్యం ఇలా ఒకటి కాదు అన్ని రంగాలను కుదేలయ్యేలా చేసింది. తాజాగా గ్రామ పంచాయతీలను నాశనం చేసేందుకు కంకణం కట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు పంచాయతీలకు ఇవ్వకుండా నిలిపివేయడంతో గ్రామాల్లో అభివృద్ధి మచ్చుకైనా కనిపించడం లేదు. చీమకుర్తి మండల పరిధిలో 24 పంచాయతీలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులు సుమారుగా రూ. కోటికి పైగా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఈనిధుల కోసం పంచాయతీల పాలకులు ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి.

**నిధుల కోసం పంచాయతీల ఎదురుచూపు..**

కూటమి ప్రభుత్వం అధికరంలోకి వచ్చిన అనంతరం 2024–25 ఆర్థిక సంఘం నిధులు తొలివిడతగా 2024 నవంబర్‌లో కేంద్రం విడుదల చేసింది. రెండో విడత నిధులు రెండు నెలల క్రితం కేంద్రం విడుదల చేసినా ఇప్పటివరకు ప్రభుత్వం పంచాయతీలకు పైసా విదల్చలేదు. ఈనిధులు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందా? అని సర్పంచులు ఎదురు చూస్తున్నారు. పంచాయతీల్లో ఇంటి పన్ను సిబ్బంది జీతాలు, పారిశుద్ధ్య, విద్యుత్ దీపాల నిర్వహణకే సరిపోవడంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

**ఎక్కడికక్కడ నిలిచిన పనులు..**

ఆర్థిక సంఘం నిధుల విడుదల ఆలస్యం కావడంతో గ్రామాల్లో పనులు ముందుకు సాగలేదు. నిధులను టైడ్ ఇన్‌స్టాల్‌మెంట్, బేసిక్ ఇన్‌స్టాల్‌మెంట్ అని రెండు పద్ధతుల్లో జమ చేస్తారు. గ్రామంలో జనాభా ప్రాతిపదికన ఈ నిధులు వస్తుంటాయి. పంచాయతీల్లో కొన్ని నిర్దేశిత పనులకు 50 శాతం నిధులు, మిగిలిన నిధులు ఇతర పనులకు వినియోగిస్తుంటారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్, తాగునీటి ప్లాంట్లలో ఫిల్టర్ బెడ్లలలో ఇసుక మార్పిడికి ఇలా అనేక పనులకు నిధులు వెచ్చిస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెండో విడత నిధులు విడుదల చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మైలవరం గ్రామంలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం



ఇలపావులూరులో ఓ వీధిలో నిలిచిన మురుగు



ఇలపావులూరు ఎస్సీ కాలనీలో మురుగు కాల్వ ఇలా..

**ఇంత నిర్లక్ష్యం ఎందుకు ?**



కేంద్రం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసి రెండు నెలలవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయకుండా పంచాయతీ పాలన కుంటుపడేలా చేస్తోంది. నిధులు విడుదల చేయడంలో ఇంత నిర్లక్ష్యం సరికాదు.

– పెరికల నాగేశ్వరరావు, సర్పంచ్ మంచికలపాడు

**డిప్యూటీ సీఎం స్పందించాలి..**



గ్రామాల అభివృద్ధికి పాటు పడుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిత్యం ప్రసంగాల్లో ఉపన్యాసాలు ఇస్తుంటారు. అయితే ఇప్పటికి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందించాలి. పులికొండ పంచాయతీ పరిధిలో మైలవరం డ్రైనేజీ వ్యవస్థ మరి దారుణంగా ఉంది.

– మక్కెన రాజేంద్రకుమార్, సర్పంచ్, పులికొండ

**సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి..**



గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పంచాయతీలో సరిపడా నిధులు లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు చేయలేకపోతున్నాం. ఇప్పుడు వర్షాలు పడటం వలన గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందువలన ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

– పులి రమణమ్మ, సర్పంచ్ ఇలపావులూరు

**15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి..**



పడమటి నాయుడుపాలెం గ్రామపంచాయతీకి నిధులు విడుదల కాకపోవడం వలన అభివృద్ధి కుంటుపడింది. మార్చి నెలలో విడుదల కావాల్సిన నిధులు కూటమి ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. – బొంత కరుణప్రియ, సర్పంచ్ పడమటి నాయుడుపాలెం

### నేటి నుంచి గోత్రిరాత్ర హోమాలు

ఒంగోలుమెట్రో: వారాహి నవరాత్రుల సందర్భంగా నేటి శుక్రవారం నుంచి గోత్రిరాత్ర హోమం నిర్వహిస్తారని గో సంరక్షణ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం ఒంగోలు నగరంలోని బాపూజీ గో సంరక్షణ సంఘం గోశాలలో గోత్రిరాత్ర హోమంపై సంఘ ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ హోమం 6వ తేదీ ఆదివారం వరకు మూడు రోజులు పాటు జరగనున్నాయని, హోమం గో ఉపాసకులు శ్రీసురాభిదాసు బ్రహ్మశ్రీ కుందుర్తి మహీకిరణ్ ధర్మ యాగ్నికత్వంలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు చాలువాది వేంకట శ్రీనివాసమూర్తి తెలిపారు. బాపూజీ గో సంరక్షణ సంఘం, శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ, పౌర్ణమి తిథి స్కందగిరి శ్రీగిరి ప్రదక్షిణ సేవా కమిటీ సంయుక్త కార్యనిర్వహణలో నిర్వహిస్తారని తెలిపారు. నేడు హోమం, 5వ తేదీ గోవింద నామావళి హోమం, సాయంత్రం ఆరు గంటల నుంచి జరుగుతాయన్నారు. 6వ తేదీ ఆదివారం దేవి ఖడ్గమాల స్తోత్ర రాహుకాల హోమం జరుగుతాయని తెలిపారు. హోమంలో పాల్గొనే దంపతులు గోశాల ప్రతినిధులను 97045 55678, 96661 23419 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో గో సంఘ కార్యదర్శి చలువాది బ్రహ్మయ్య, కోశాధికారి పేర్ల వెంకట నరసింహారావు, ఉపాధ్యక్షులు కనిశెట్టి రమణయ్య, సహకార్యదర్శి గుర్రం బద్రీ నారాయణ, తూనుగుంట మల్లికార్జునరావు, నూనె రామాంజనేయులు, తాళ్లూరి శివప్రసాద్, వేమూరి చక్రధర పెరుమాళ్లు, శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రామణ గుప్త జంధ్యం, సహకార దర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, పౌర్ణమి తిథి గిరి ప్రదక్షిణ నిర్వాహకులు బీ రాఘవరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బాపూజీ గో సంరక్షణ సంఘ ప్రతినిధులు

## ఎన్నికల హామీల అమలులో కూటమి విఫలం



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవిబాబు



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని 15వ డివిజన్‌లో రామ్‌నగర్ 2వ లైన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయిన పేద, మధ్య, బడుగు బలహీన వర్గాల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కల్లబొల్లిమాటలు చెప్పి ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షులు కఠారి శంకరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, కొత్తపట్నం మండల అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, 15వ డివిజన్ అధ్యక్షుడు వీసం బాలకృష్ణ, పార్టీ జాయింట్ సెక్రటరీ పాలడుగు రాజీవ్, కేవీ ప్రసాద్, కార్పొరేటర్లు ఇమ్రాన్ ఖాన్, ప్రవీణ్‌కుమార్, పిగిలి శ్రీనివాస్, ఏ శ్రీనివాసరెడ్డి, బుజ్జి, చిన్నా, పేరం ప్రసన్న, ఫాతిమా, దాకా సుబ్బారెడ్డి, పెరిదేపి సుబ్బారెడ్డి, వేణుగోపాల రెడ్డి, పెద్దిరెడ్డి వెంకారెడ్డి, గద్దె చైతన్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



చీమకుర్తిలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు సుబ్బారావు



ఎస్‌ఎన్‌పాడులో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సంతనూతలపాడు: కర్షక, కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా నాయకుడు బంకా సుబ్బారావు విమర్శించారు. ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మండల కేంద్రం బస్టాండ్ సెంటర్ వద్ద గురువారం సీఐటీయూ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సుబ్బారావు పిలుపునిచ్చారు. 29 కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికులను యజమానులకు బానిసలుగా మారుస్తున్నట్టు సుబ్బారావు ఆరోపించారు. చట్టాలు సక్రమంగా అమలు కానందువల్ల కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద్వ విధానాల వల్ల రోజు రోజుకి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి కార్మికులు జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని వాపోయారు. రవాణా రంగ కార్మికులకు ఎటువంటి సామాజిక భద్రత సౌకర్యాలు లేక ముఖ్యంగా బాడుగలు లేక వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రవాణా రంగ కార్మికులకు పేరు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆటో వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కే. ప్రసాద్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: దేశవ్యాప్తంగా ఈనెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను సయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు పిలుపునిచ్చారు. గురువారం చీమకుర్తి సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సీఐటీయూ మండల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పెట్టుబడిదారుల కొరకు మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్స్ కోడ్‌ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని సంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయు, ఇతర అనుబంధ కార్మిక సంఘాల నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు స్థానికులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల పరిశీలన

సంతనూతలపాడు: గ్రామంలో జరుగుతున్న పనులను ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించారు. మండలంలోని మద్దులూరు గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించి అధికారులకు, సిబ్బందికి సూచనలిచ్చారు. సిబ్బంది ఇంటింటికి తిరిగి చెత్త సేకరించాలన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బీ శైలజ అమర్నాథ్, పంచాయతీ కార్యదర్శి బి. శ్రీనివాసరావు, నువ్వుల మీరయ్య, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

తక్కెళ్లపాడులో గ్రామంలో పారిశుద్ధ్య పనులను మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పరిషత్ సీఈవో బీ చిరంజీవి పరిశీలించారు. ఐవీఆర్ విలేజ్ కావడంతో గ్రామంలో శానిటేషన్, ఎస్‌డబ్ల్యూపీసీ, వర్మీ కంపోస్టు తయారీ తదితర వాటిని చిరంజీవి పరిశీలించి పంచాయతీ సిబ్బందికి తగు సూచనలను ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్బాబు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్ రెడ్డి, గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తక్కెళ్ల పాడులో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

## కిల్కారి కాల్స్‌తో గర్భిణులు, బాలింతలకు జాగ్రత్తలు





అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

సంతనూతలపాడు: గర్భిణులు, బాలింతల వివరాల నమోదు తప్పనిసరిగా చేయాలని ప్రోగ్రాం ఆఫీసర్ రాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు మెరుగైన ప్రయోజనాలు నిమిత్తం కిల్కారి కాల్ సేవలపై ఆయన వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతల కోసమే కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాంను ప్రవేశపెట్టిందన్నారు. కిల్కారి కాల్ ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్య సమాచారం అందిస్తారని ఆయన తెలిపారు. గర్భిణి 4వ నెల నుంచి మొదలుకొని పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు కిల్కారి కాల్స్ ఇస్తాయన్నారు. వారానికి ఒకసారి గర్భిణులు, బాలింతలకు ఫోన్లు వస్తాయని, కిల్కారి కాల్ నెంబర్‌ను 01244451660 మొబైల్‌లో సేవ్ చేసుకోవాలన్నారు. సమాచారాన్ని మళ్లీ వినాలంటే 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వినవచ్చని ప్రోగ్రాం ఆఫీసర్ రాజు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జె. నాగరాజు, జిల్లా ఆశ నోడల్ అధికారి రాజేశ్వరి, సీహెచ్‌ఓ మాధవరావు, పీహెచ్‌ఎన్. వీరమ్మ, హెచ్ వీ ప్రభావతి, హెచ్ ఎస్.కృష్ణ, ఆశాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## రాజ్యాంగానికి విరుద్ధంగా చేస్తారా ?

- వాడీవేడిగా మండల సమావేశం
- హైకోర్టు తీర్పును పాటించని విద్యుత్ అధికారులు
- సర్వసభ్య సమావేశంలో విద్యుత్ ఏడీని నిలదీసిన ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంజిరెడ్డి

కొత్తపట్నం: అధికారులు రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించడం బాధగా ఉందని.. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. కొప్పోలు దగ్గర ఆక్వా రైతుకు ట్రాన్స్‌ఫార్మర్‌కు డీడీ కట్టించి మంజూరు చేయించారు. దిమ్మెను కట్టిస్తే దానిని పగులుగొట్టించడం, ఆ రైతును ముప్పతిప్పలు పెట్టడం ఎంత దుర్మార్గంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. చట్టాన్ని గౌరవించాల్సింది పోయి ఆగౌరవపరిచే విధంగా ప్రవర్తించడం ఎంతో బాధగా ఉందన్నారు. గ్రామ పంచాయతీల్లో చేసే ప్రతి పని ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచ్‌లకు తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అల్లూరులో పశువుల హాస్పిటల్ సరిగా తీయడం లేదు.. ఎప్పుడు చూసిన తాళాలు వేసి ఉంటున్నాయని నా దృష్టికి వచ్చిందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలో 15 పంచాయతీలకు రూ 7.32 కోట్లు వాటర్ పైపులైన్లుకు అవసరమని ప్రతిపాదనలు పంపించామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు శాంతారావు మాట్లాడుతూ చాలా మందికి భూమి లేకపోయిన ఆన్‌లైన్‌లో ఉన్నట్లుగా చూపించడం వలన తల్లికి వందనం రాలేదన్నారు. ఎన్‌ఆర్‌జీఎస్ కూలీలకు ఎంపీపీ సొంత నగదుతో ఈ–శ్రమ్ నగదు చెల్లిస్తానని జాబితా ఇవ్వమంటే ఎందుకు ఇవ్వలేదని ఏపీవో నాగరాజును ప్రశ్నించాడు.

**పొగాకును ఎందుకు కొనడం లేదు.. ?**

ఈతముక్కల ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం జోనల్ ప్రెసిడెంట్ ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పండించిన పొగాకును ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తానని చెప్పి నేటికి కొనుగోలు చేయలేదన్నారు. రైతులు భారీగా నష్టపోతున్నారని ఏవో దృష్టికి తీసుకెళ్లారు. పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు మాట్లాడుతూ సీఆర్‌పీఎస్ ప్రాజెక్ట్‌కు సంబంధిన సమాచారం అధికారులు చెప్పడం లేదని సభలో ప్రశ్నించాడు.

**ఎన్ఆర్ఈజీఎస్ రికార్డుల్లో అవకతవకలు..**

పంచాయతీ కార్యాలయంలో ఉండాల్సిన ఉపాధి హామీ పనుల రికార్డులు ఎక్కడ పెడుతున్నారని సభ్యులు ఏపీవో నాగరాజును నిలదీశారు. రికార్డుల్లో తప్పుడు సమాచారం రాసుకుని సొమ్ము చేసుకోవడానికి మీ కార్యాలయాల్లో పెట్టుకుంటున్నారని ఆరోపించారు. 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆలూరు, గాదెపాలెం, బీరంగుంట, సంకువారిగుంట ఈతముక్కల వంటి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయానికి ఎందుకు రావాలన్నారు. గుట్టుగా ఎన్ఆర్‌జీస్ కార్యాలయంలో ఎంబుక్‌లు, చెక్‌బుక్‌లు, ఖర్చుల వివరాల పుస్తకాలు ఎందుకు పెట్టుకుంటున్నారని ప్రశ్నించారు. కోఆప్షన్ మెంబర్ బాజీ మాట్లాడుతూ విద్యుత్ కోతలు విపరీతంగా ఉన్నాయని దానిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శాంతి, ఎంపీడీవో శ్రీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, ఏవో కిషోర్‌బాబు, డాక్టర్లు నవ్వరెడ్డి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.